గురువారం । తెలంగాణ
07 మే 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

ప్రతిభకు పట్టాభిషేకం..

పది ఫలితాల్లో 'త్రివేణి' విజయ విహారం..
జిల్లా టాపర్లుగా పాఠశాల విద్యార్థులు
అక్షయ శివానికి జిల్లా ప్రథమ స్థానం..
విజేతలను అభినందించిన జిల్లా విద్యాశాఖాధికారిణి బి. నాగలక్ష్మి

కొత్తగూడెం, మే 06(నినాదం)

తెలంగాణ పదో తరగతి ఫలితాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యా చిత్రపటంలో 'త్రివేణి' పాఠశాల తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. ఫలితాల్లో ప్రభంజనం సృష్టిస్తూ జిల్లా టాపర్లను అందించిన త్రివేణి విద్యార్థులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి బి. నాగలక్ష్మి ఘనంగా సన్మానించారు.

జిల్లా వేదికపై త్రివేణి తారలు..

ఈ ఏడాది ఫలితాల్లో త్రివేణి విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ స్కోరుతో రికార్డు సృష్టించారు. విద్యార్థిని బి. అక్షయ శివాని 592 మార్కులతో జిల్లాలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అగ్రస్థానంలో నిలిచింది. పి. అక్షయ్ మరియు కె. వర్షిత చెరి 586 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

విద్యా ప్రమాణాలే విజయ రహస్యం: డీఈఓ ప్రశంసలు

విద్యార్థుల ప్రతిభను డీఈఓ నాగలక్ష్మి ప్రత్యేకంగా విశ్లేషించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "కఠోర శ్రమ, అంకితభావం ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని ఈ విద్యార్థులు నిరూపించారు. జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటిన ఈ చిన్నారులు అందరికీ మార్గదర్శకులు. నాణ్యమైన విద్యా ప్రమాణాలను పాటిస్తూ, విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దుతున్న త్రివేణి యాజమాన్యం కృషి అభినందనీయం" అని కొనియాడారు. విద్యార్థులు ఇదే పట్టుదలతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు.

సమిష్టి కృషితోనే ఈ ఘనత: యాజమాన్యం

ఈ విజయంపై త్రివేణి-కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్లు జి. జగదీష్, జి. వీరేంద్ర చౌదరి హర్షం వ్యక్తం చేశారు. ప్రణాళికాబద్ధమైన బోధన, విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ స్థాయిలో మార్కులు సాధించడం సాధ్యమైందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఓ కె. మురళీ కృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సింగ్, స్కూల్ ఇంచార్జ్ లు శ్రీకాంత్, హనుమంతరావు తదితరులు పాల్గొని విద్యార్థులకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా టాపర్లలో మెజారిటీ స్థానాలను త్రివేణి కైవసం చేసుకోవడం, ముఖ్యంగా 592 వంటి భారీ స్కోరు సాధించడం జిల్లా విద్యా వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

ఆధునిక వ్యవసాయంపై దృష్టి సాధించాలి
- స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య
- చేవెళ్లలో ఘనంగా రైతు వారోత్సవాలు

చేవెళ్ల మే 06(నినాదం):

ఆధునిక వ్యవసాయంపై దృష్టి సాధించాలని రైతు వారోత్సవాల సందర్భంగా శాసనసభ్యులు కాలే యాదయ్య రైతులకు సూచించారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంను పురస్కరించుకొని బుధవారం చేవెళ్లలోని రైతు వేదికలో రైతు వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి సాధించి ఆర్థికంగా ఎదగాలని అన్నారు.రైతులు మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు తగిన మార్కెట్ సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు.ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ రకాల పంటలను సాగు చేయాలని, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ, సహకార సంఘాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీవో, పార్థ సింహారెడ్డి, ఏడీఏ సురేష్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఏపీలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

మోడీ సభకు భారీగా తరలి రావాలి : ఎంపీ కొండా
చేవెళ్ల మే 06 (నినాదం):

సభ విజయానికి కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం చేవెళ్లలో వాల్ పెయింటింగ్ కార్యక్రమంలో పాల్గొని ఈ నెల 10న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు భారీగా హాజరు కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సభ వేదిక అవుతుందన్నారు. నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరా వడానికి గ్రామ, మండల స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు మాణిక్య రెడ్డి, శర్వలింగం, అనంత్ రెడ్డి, వైభవ్ రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు

ఆత్మకూర్ మండల విద్యాధికారిగా శ్రీనివాసులు
అమరచింత, మే 6, (నినాదం):

ఆత్మకూరు మండల విద్యాధికారిగా ఆరేపల్లిలో జిహెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన తన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంఈఓ గా విధులు నిర్వహించిన బాలరాజు పదవీ విరమణ పొందడంతో శ్రీనివాసులు ఎంఈఓ గా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు అధికారులు సహకరించాలని కోరారు. ఎంఈఓ గా నియమితులైన శ్రీనివాసులకు ఉపాధ్యాయులు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వీడాలి : తహసీల్దార్‌కు వినతి
ఆర్మూర్, మే 6(నినాదం): బాల్కొండ నియోజకవర్గం ఎర్గట్ల మండలంలోని రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ, తక్షణమే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ బుధవారం ఎర్గట్ల మండల తహసీల్దార్ మల్లయ్యకు మండల బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు వినతి పత్రం సమర్పించారు.

అనంతరం మండల బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ, గత ప్రభుత్వం కంటే భిన్నంగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని నాయకులు ఆరోపించారు. దొడ్డు వడ్లు, సన్న వడ్లు, మక్కలను సైతం కొనుగోలు చేయకుండా ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారుఆవేదన వ్యక్తం చేశారు.తక్కువ తేమ ఉన్నప్పటికీ తూకంలో కోతలు విధిస్తున్నారని, క్వింటాలుకు కటింగ్ పేరుతో అన్యాయం చేస్తున్నారని రైతులు ఫిర్యాదు చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో కొనుగోలు చేయాలి. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా ఎటువంటి నిబంధనలు లేకుండా సేకరించాలి. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని మండల బి.బి.ఆర్.ఎస్. పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు హెచ్చరించారు. ఈ వినతి పత్రం యొక్క నకళ్ల కాపీలను నిజామాబాద్ జిల్లా కలెక్టర్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ కార్యాలయాలకు కూడా పంపినట్లు బిఆర్ఎస్ నాయకులు తెలిపారు. ముందుగా మండల కేంద్రమైన ఏర్గట్ల గ్రామంలో రహదారిపై బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల రైతులు, బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
జిల్లా వైద్యాధికారి
డాక్టర్ తుకారాం రాథోడ్

అశ్వారావుపేట, మే06(నినాదం)

ప్రభుత్వ వైద్య సేవలు క్షేత్రస్థాయిలో ప్రజలందరికీ పారదర్శకంగా అందాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ తుకారాం రాథోడ్ హెచ్చరించారు. బుధవారం ఆయన అశ్వారావుపేట మండలంలోని రెడ్డిగూడెం ఆరోగ్య ఉప కేంద్రాన్ని (సబ్ సెంటర్) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, అందిస్తున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కీలక ఆదేశాలు జారీ చేశారు:

వంద శాతం టీకాకరణే లక్ష్యం

గ్రామాల్లో గర్భిణీలను ప్రారంభ దశలోనే నమోదు చేయాలని, వారికి అవసరమైన వైద్య పరీక్షలు సకాలంలో అందించాలని ఆదేశించారు. ఏ ఒక్క శిశువు కూడా టీకాకరణకు దూరం కాకుండా క్షేత్రస్థాయి పర్యవేక్షణను బలోపేతం చేయాలన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై నిరంతర నిఘా

ఎన్‌సీడీ కార్యక్రమం కింద గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి తగిన మందులు అందేలా చూడాలని, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని తెలిపారు.

రికార్డుల నిర్వహణలో పారదర్శకత

మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు తమ పరిధిలోని ఆరోగ్య నివేదికలను, రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. విధుల్లో సమయపాలన పాటిస్తూ, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందిని కోరారు. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం వైద్య సేవలు ప్రజల ముంగిటకే చేరేలా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మ దహనం
భీమదేవరపల్లి, మే 6 (నినాదం):

శ్రీరాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మంత్రి కొండా సురేఖకు వ్యతిరేకంగా బీజేపీ నేతలు ఆందోళన చేపట్టారు. ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేసి నినాదాలు చేశారు. మంత్రి వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీశాయని, వెంటనే క్షమాపణ చెప్పి పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడ్డి కట్టే యంత్రంలో చేయి ఇరుక్కొని రైతు మృతి
భీమదేవరపల్లి, మే 6 (నినాదం):

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామ శివారులో విషాద ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ పనుల్లో భాగంగా ట్రాక్టర్‌కు అమర్చిన గడ్డి కట్టే యంత్రంలో వరి గడ్డి కట్టలు కడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. గట్ల నర్సింగపూర్ గ్రామానికి చెందిన రచ్చ సంపత్ (50), తండ్రి లక్ష్మయ్య.గడ్డి కట్టే యంత్రాన్ని సరి చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా అతని చేయి యంత్రంలో ఇరుక్కుంది. ఈ ఘటనలో చేయి పూర్తిగా భుజం వరకు తెగిపోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై మృతుడి భార్య రచ్చ రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో ఈ ఘటన విషాద వాతావరణాన్ని నెలకొల్పింది.

ముత్తారం ఇంచార్జీ సర్పంచ్‌గా మాట్ల హరికుమార్

భీమదేవరపల్లి మే 6 (నినాదం):

భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామానికి ఇంచార్జ్ సర్పంచ్‌గా మాట్ల హరికుమార్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం ప్రకారం ఆయన ఈ ఏడాది ఆగస్టు నెల వరకు గ్రామ ఇంచార్జ్ సర్పంచ్‌గా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించగా, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో మాట్ల హరికుమార్ బాధ్యతలు స్వీకరించారు. పదవి చేపట్టిన వెంటనే గ్రామంలో తాగునీటి సమస్యను గుర్తించి పాడై ఉన్న బోర్లను మరమ్మతు చేయించారు అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారులు వంటి మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వెంటనే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం వార్డు సభ్యులు, గ్రామస్తులు, యువత అందరూ కలిసి సహకరించాలని కోరారు. సమిష్టి కృషితోనే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారుపాక శరత్, వార్డు సభ్యులు సార్వందుల నవిత, దండెపల్లి శిరీష, మ్యాక నరేష్, కొర్ర తిరుపతి, కదారి చింటూ, దొండ మౌనిక, రేణికుంట్ల సందీప్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన ఇంచార్జ్ సర్పంచ్‌కు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమేష్
కమలాపూర్ మే 6 (నినాదం)

మాజీ ఎంపీపీ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్ల రమేష్ ను హనుమకొండ జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శిగా నియామకం చేసినట్లు బుధవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మాట్ల రమేష్ గతంలో కమలాపూర్ ఎంపీపీగా పనిచేసిన అనుభవ దృష్టిలో పెట్టుకొని నియమించారని తెలిపారు. మండలంలో వివిధ వర్గాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న మాట్ల రమేష్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం చేయటం వల్ల పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. తన నియామకానికి సహకరించిన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ,మంత్రులు పొన్నం ప్రభాకర్,దుద్దిళ్ళ శ్రీధర్ బాబు , వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,జిల్లా పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకట రాంరెడ్డి , హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్,పార్టీ నాయకులకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

పేదల ముంగిటకే ప్రజాపాలన..

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు..
- 35 రోజుల్లోనే సాదా బైనామా సమస్యల పరిష్కారం..
- రైతులకు రుణమాఫీ, మద్దతు ధరతో కొండంత అండ...
- గువ్వలగూడెం ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..

పాలేరు మే 06(నినాదం)

నేలకొండపల్లి రాష్ట్రంలో పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు లేకుండా, పాలనను నేరుగా వారి గడప వద్దకే తీసుకువచ్చాం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామంలో నిర్వహించిన 'ప్రజాపాలన - ప్రజాదర్బార్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ దివాకరతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

రైతు పక్షపాతి మన ప్రభుత్వం...

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొందని విమర్శించారు. "నాడు వరి వేస్తే ఉరి అన్న పరిస్థితి ఉండేది. కానీ నేడు ప్రతి గింజనూ మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నాం. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 అదనపు బోనస్ ఇస్తున్నాం" అని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.21 వేల కోట్ల రుణమాఫీతో 25 లక్షల మంది రైతులకు విముక్తి కల్పించామని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేల సాయం అందిస్తున్నామని వివరించారు.

సొంతింటి కల సాకారం...

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు లేని నిరుపేదలకు గృహ కల్పన చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పునరుద్ఘాటించారు. "ఇప్పటికే పెద్ద ఎత్తున ఇళ్లు మంజూరు చేశాం. మే నెలాఖరు నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం" అని ప్రకటించారు. భూ సమస్యలను 'భూ భారతి' ద్వారా ప్రక్షాళన చేస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను రాబోయే 35 రోజుల్లో ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మహిళా సాధికారతే లక్ష్యం...

రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం సరఫరా వంటి పథకాలు పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. ప్రజాదర్బార్‌లో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును గరిష్ఠంగా మూడు నెలల వ్యవధిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాంప్రసాద్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, బచ్చాలకురి నాగరాజు , అంజని, కడియాల సరేష్ పాకనాటి కన్నారెడ్డి చెరుకుపల్లి రాజేష్ టిగుళ్ల భవాని ,కర్ల అశోకు, మందడి నాగ శేను తదితరులు పాల్గొన్నారు.



గురువారం । తెలంగాణ
07 మే 2026

నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

అన్నదాత ఆగమాగం..

- అకాల వర్షంతో రైతన్నలకు అపార నష్టం
- కొనుగోలు కేంద్రాల్లో నిండా మునిగిన ధాన్యం
- కన్నీరుమున్నీరు అవుతున్న రైతులు

భూపాలపల్లి ప్రతినిధి, మే 06(నినాదం):
అన్నదాత ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయానికి వరణుడు నిండా ముంచాడు. లక్షల రూపాయలు అప్పుచేసి పెట్టుబడి పెట్టి పంట సాగు చేసిన రైతన్నను వర్షం కోలుకోలేని దెబ్బ కొట్టింది. జిల్లాలో బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం అన్నదాతను ఆగం చేసింది. సుమారు రెండు గంటల పాటు అతి భారీ వర్షం కురవడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు నిల్వ చేసుకున్న ధాన్యం అకాల వర్షంతో తడిసి ముద్దయింది. మంగళవారం అర్ధరాత్రి నుండి ఉరుములు మెరుపులతో కూడిన వాతావరణం ఏర్పడగా ఒకంత అన్నదాత ముందస్తు చర్యలో భాగంగా ధాన్యం కాపాడుకోవడానికి ప్రయత్నాలు చేశారు. ఆరబోసిన ధాన్యం కుప్పలుగా చేసి అందుబాటులో ఉన్న టార్పాలిన్ కవర్లు కప్పి తాత్కాలిక చర్యలు చేపట్టుకున్నారు. పెద్ద ఎత్తున గాలి దుమారం ఏర్పడడంతో ధాన్యం కుప్పలపై ఉంచిన టార్పాలిన్ కవర్లు, పరదలు ఎక్కడీకక్కడ ఎగిరిపోయాయి. చినుకులతో మొదలైన వర్షం భారీగా కురవడంతో ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. జిల్లాలోని పలు మండలాల్లో స్వల్పం నుండి అధిక మోతాదులో వర్షం పడడంతో ధాన్యం వర్షార్పణం అయింది.

నీటిమయమైన కొనుగోలు కేంద్రాలు...

రైతులు పండించిన ధాన్యం కు మద్దతు ధర కల్పించడం కోసం గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు అకాల వర్షానికి నీటి కుంటలుగా మారిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో వర్షపు నీరు నిలవడంతో పలువురు రైతులకు చెందిన ధాన్యం పూర్తిగా మునిగిపోయింది. మహాదేవపూర్ మండల కేంద్రంతో పాటు సూరారం, కాటారం మండలంని పలు కొనుగోలు కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధాన్యం నీట మునిగింది. వర్షానికి రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. వర్షార్పణమైన ధాన్యమును చూసుకుంటూ రైతులు నిస్సాయంగా లబోదిబోమన్నారు.

నిండా మునిగిన అన్నదాతలు..

జిల్లాలోని పలు మండలాల్లో గత కొన్ని రోజుల క్రితమే వరికోతలు పూర్తయి ధాన్యం రైతు చేతికి వచ్చింది. దీంతో రైతులు తమ ధాన్యమును విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేసిన ప్రాంతంలో ఆరబోశారు. కాగా పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, ప్రారంభమైన కేంద్రాల వద్ద కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో ధాన్యం పెద్ద ఎత్తున నిలిచిపోయింది. అంతేకాకుండా కాంటాలు పూర్తయిన ధాన్యం సైతం రవాణా జరగకపోవడంతో అట్టి ధాన్యం బస్తాలు కేంద్రాల్లోనే ఉండిపోయాయి. అకాల వర్షానికి కేంద్రాల్లో నిలువ ఉన్న ధాన్యం మొత్తం పూర్తిగా తడిసిపోవడంతో రైతన్నలకు అపార నష్టం చేకూరింది.

కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల అలసత్వం..

అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు.

తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం.. - జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

అకాల వర్షానికి తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం మహాదేవపూర్ మండలంలోని మహదేవపూర్, సూరారం గ్రామాలలో పర్యటించిన కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం పరిస్థితిని స్వయంగా తెలుసుకొని, రైతులతో ముకాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు. తడిసిన ధాన్యాన్ని తక్షణమే కాటారంలోని అన్నపూర్ణ పారబాయిల్ రైస్ మిల్ తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు మరియు రవాణా, దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం కాకుండా పర్యవేక్షణకు మిల్లుల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ లేకుండా కేటాయించిన రైస్ మిల్లులకు వెంటనే రవాణా చేయాలని డీఎంకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం రవాణాకు లారీలు అందుబాటులో ఉంచాలని, ఇబ్బంది లేకుండా చూడాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, ఎంపిడిఓ రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి ప్రజా పాలన ప్రగతి నివేదిక..

పాలేరు మే 06(నినాదం)

నేలకొండపల్లి ప్రజా పాలన ప్రగతి నివేదిక భాగంగా నేలకొండపల్లి సహకార సంఘం వారు నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి నివేదికలో భాగంగా రైతు వేదికలు నిర్వహించారు పి ఐ సి రాజశేఖర్ అధ్యక్షతన ప్రజాపాలనం ప్రగతి నివేదిక చదివి వినిపించారు ఎస్బిఐ డిసిసిబి యూనియన్ బ్యాంక్ టీ జి బ్యాంక్ ద్వారా రైతులకు రుణాలు స్వల్పకాలిక దీర్ఘకాలిక రుణాలు ఇప్పటకు అవసరమైన సూచనలు ఇవ్వడం అయినది మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు మాట్లాడుతూ ధాన్యం మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి ఉప సర్పంచ్ మహేష్ మార్కెట్ కమిటీ కార్యదర్శి పంతులు ఉమామహేశ్వరి మేనేజర్లు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామిక తెలంగాణ కోసం టీజేఎస్ కృషి : కామెర గట్టయ్య

కాటారం, మే 06 (నినాదం): ప్రజాస్వామిక తెలంగాణ సాధన లక్ష్యంగా తెలంగాణ జనసమితి (టీజేఎస్) పనిచేస్తున్నదని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య తెలిపారు. కాటారం అంబేద్కర్ సెంటర్‌లో టీజేఎస్ రాష్ట్ర 4వ ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 12న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ జలవిహార్‌లో జరగనున్న సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో అమరుల త్యాగాల ఫలితంగా రాష్ట్రం ఏర్పడినా, వారి ఆశయాలైన నీళ్లు, నిధులు, నియామకాలు ఇంకా పూర్తిగా నెరవేరలేదని అన్నారు. అవినీతి రాజకీయాల వల్ల సామాన్య ప్రజలు రాజకీయాలకు దూరమవుతున్నారని విమర్శించారు. ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో టీజేఎస్ ప్రజల పక్షాన నిలబడి ప్రజాస్వామిక తెలంగాణ సాధనకు కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీక కిరణ్, వక్కల బాపు, మాలమహానాడు రాష్ట్ర నాయకులు బాపు, సింగరేణి తెలంగాణ ఉద్యోగ నాయకులు దాసరి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మార్కెట్ సదుపాయాలపై అవగాహన

కోహెడ, మే 6 (నినాదం) :

వ్యవసాయ మార్కెట్ కమిటీ కోహెడ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక రైతు వారము" కార్యక్రమంలో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు.సమావేశంలో రైతులకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా కల్పిస్తున్న సదుపాయాలు, మార్కెట్ యార్డు ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు, పంటలను సరైన విధంగా మార్కెటింగ్ చేసుకునే పద్ధతులు, రైతులు అధిక లాభాలు పొందే మార్గాలపై అధికారులు వివరించారు. రైతులు నాణ్యమైన పంట ఉత్పత్తితో పాటు మార్కెట్ ధోరణులను అవగాహన చేసుకుని సరైన సమయంలో అమ్మకాలు నిర్వహిస్తే మెరుగైన ఆదాయం పొందవచ్చని సూచించారు.అలాగే ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కోహెడ చైర్‌పర్సన్, పాలకవర్గ సభ్యులు, కోహెడ గ్రామ సర్పంచ్, ప్రాథమిక సహకార సంఘం సీఈఓ, ఐకేపీ ఏపీఎం, ఏఈఓలు, రైతులు, కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి..

మార్కెట్ కమిటీ చైర్పర్సన్ తిరుపతమ్మ

కోదాడ,మే 6(నినాదం):

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడిని సాధించాలనీ వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్పర్సన్ తిరుపతమ్మ పేర్కొన్నారు బుధవారం రైతు వారోత్సవాల పురస్కరించుకొని కోదాడ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు... పంటల వైవిధ్యం పెంపు, మార్కెటింగ్ అవకాశాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైస్ చైర్మన్ బషీర్ మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కమిటీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పిఎసిఎస్ చైర్మన్లు డైరెక్టర్లు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తులతో దాడి

- దాడి అనంతరం కంపచెట్లల్లో విసిరివేసిన వైనం
- సకాలంలో స్పందించిన యస్ఐ బాబు
- పరారిలో నిందుతులు.. కేసు నమోదు

హుజూర్ నగర్, మే 06 (నినాదం):

మఠంపల్లిలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన తుపాకుల మహేష్ పై అదే గ్రామానికి చెందిన ఇతర సామాజిక వర్గానికి చెందిన సుమారు 10 మంది కత్తులతో తీవ్రంగా గాయపరచి ముళ్లకంపలో పడవేసి వెళ్లడం జరిగింది.దీనిలో ట్విస్ట్ ఏమిటంటే దాడి చేసిన వ్యక్తులు ఏమీ తెలియనట్లు అక్కడ ఎవరో కొట్టుకున్నారు. ఒక వ్యక్తి సావు బతుకుల మధ్యలో కొట్టుమిట్టాడుతున్నాడు అని పోలీసులకు సమాచారం ఇవ్వడం కొసమెరుపు విషయం తెలుసుకున్న ఎస్సై బాబు హుటాహుటిన తన సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడ్ని 108 ద్వారా హుజూర్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి స్వయంగా బాధితుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం నిందితుల కోసం గాలించగా వారు గ్రామాన్ని విడిచి వెళ్లడంతో బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాబు తెలిపారు.

అన్నప్రసాద వితరణ

కోదాడ,మే 6(నినాదం):

తెలంగాణ శబరిమలగా ప్రసిద్ధి చెందిన అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం 17వ వారానికి చేరుకుంది. ఈ వారంలో చెన్నారం వాసులు కే. సైదులు గురుస్వామి, గురవమ్మ, వారి కుమారుడు సాయినాథ్ దాతలుగా వ్యవహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, జిల్లా అధ్యక్షుడు అర్పపల్లి సత్యనారాయణతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణపై ఫిర్యాదు

కోదాడ,మే 6(నినాదం):

కోదాడ మున్సిపాలిటీ 32వ వార్డులో మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన డబ్బా కొట్టును తొలగించాలని బీఆర్ఎస్ వార్డు ఇన్‌ఛార్జ్ మాదల ఉపేందర్ మున్సిపల్ కమిషనర్ రమాదేవికి ఫిర్యాదు చేశారు. గతంలో అక్కడ గ్రంథాలయం ఉండేదని, ప్రస్తుతం వాహనాల నిల్వకు ఉపయోగిస్తున్న స్థలాన్ని ఆక్రమంగా ఆక్రమించారని పేర్కొన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌కు కూడా ఫిర్యాదు చేశారు.

ఘనంగా వైరా శ్రీ షిరిడి సాయి మందిర 31వ వార్షికోత్సవం

వైరా మే 6, (నినాదం): వైరా మున్సిపాలిటీ పరిధిలోని సాయి నగర్ లో వేంచేసి ఉన్న శ్రీ షిరిడి సాయి మందిర 31 వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మునిసిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 31 సంవత్సరాలుగా అంగరంగ వైభవంగా శ్రీ శిరిడి సాయి మందిరం వార్షికోత్సవాలకు, స్థానిక కూరగాయల వ్యాపారులు, కిరాణా దుకాణాల వారు భాగస్వాములవుతూ నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. అనంతరం వైరా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌ను ఆలయ నిర్వాహక కమిటీ వారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మందిర కమిటీ చైర్మన్ పొడపాటి నాగేశ్వరరావు, కోశాధికారి లగడపాటి బోసు, 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత, దుర్గాప్రసాద్, నల్లమోతు వెంకటయ్య, మిద్దె చిన్న సుబ్బారావు, డాక్టర్ కాప మురళీకృష్ణ, తల్లపురెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు వారోత్సవం ఘనంగా నిర్వహణ

- రైతులకు అవగాహన, మద్దతు ధరలపై భరోసా

పెబ్బేరు మే 06(నినాదం):

పెబ్బేరు మున్సిపాలిటీ వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతు వారోత్సవం సందర్భంగా ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ గౌని ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ సేవలు, పంటల ఉత్పత్తి, మార్కెటింగ్ విధానాలపై వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని, వరి పంటకు క్వింటాల్‌కు రూ.2,389తో పాటు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే మొక్కజొన్నకు ?2,400 మద్దతు ధర కల్పిస్తున్నట్లు చెప్పారు. మొక్కజొన్న పంట ఒక ఎకరానికి 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి సాధ్యమవుతుందని, పంట మార్పిడి (క్రాప్ రొటేషన్) ద్వారా నేల సారాన్ని పెంచి, అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. ప్రస్తుతం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీ రేట్లపై పంట రుణాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు రైతు వెన్నెముకలాంటివాడు. అన్నదాతగా సమాజానికి ఆహార భద్రతను అందించే రైతు కష్టమే ప్రతి ఇంటికి అన్నం చేరడానికి కారణం. వాతావరణ మార్పులు, మార్కెట్ మార్పులు వంటి సవాళ్లను ఎదుర్కొంటూ రైతు నిరంతరం శ్రమిస్తున్నాడు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా రైతులు మరింత లాభదాయకంగా వ్యవసాయం చేయగలరని నిపుణులు సూచిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర, సింగిల్ విండో చైర్మన్ గౌని కోదండ రాంరెడ్డి, వైస్ చైర్మన్ ఆంజనేయులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఎంపీటీఓ, అగ్రికల్చర్ అధికారులు, ఎస్బిఐ మేనేజర్, మార్కెట్ కార్యదర్శి, సింగిల్ విండో సీఈఓ, ఏపీఎంలు, ఐకేపీ, మెప్మా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు యుగేందర్ రెడ్డి, రంజిత్ కుమార్, ఎల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొండా సురేఖ దిష్టిబొమ్మ దహనం

ధర్మపురి మే 06(నినాదం)

"జై శ్రీరామ్ అంటే దద్దులు వస్తున్నాయా?" అంటూ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ ధర్మపురిలో బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గాజు భాస్కర్ మాట్లాడుతూ.. హిందూ దేవతలు, శ్రీరాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా కొనసాగేందుకు ఆమెకు నైతిక అర్హత లేదని విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ నాయకులు హిందూ దేవుళ్లను అవమానిస్తున్నారని ఆరోపించారు. "జై శ్రీరామ్" నినాదాన్ని దద్దులతో పోల్చడం కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసిందని అన్నారు. హిందూ ధర్మంపై విశ్వాసం లేని వ్యక్తులు దేవాదాయ శాఖలో కొనసాగకూడదన్నారు. కొండా సురేఖ హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే భయంతో కాంగ్రెస్ నాయకులు సహనం కోల్పోయి మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, సీనియర్ నాయకులు స్తంభంకాడి శ్యాం, పల్లెర్ల సురేందర్, తీర్మాండాస్ సత్యనారాయణ, మండలోజీ సూరజ్, అప్పు మల్లేష్, సుంకు మధుసూదన్, బాకీ అనిల్, రాగూర్ రాకేష్, కలకోట రాజు, సంఘీ రాజేష్, బాకీ రాజేష్, సోమిశెట్టి శివసాయి, శ్యాంరావు, నాగులు, మామిడి రంజిత్, కొత్తకొండ రాజు, కాశెట్టి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

గద్వాల బ్యూరో మే 6 (నినాదం)

జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి, అన్ని వర్గాల ప్రజలు విస్తృతంగా పాల్గొనేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ రెడ్ క్రాస్ జిల్లా సంఘం చైర్మన్, పలువురు సభ్యులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 1200 మంది రెడ్ క్రాస్ సభ్యులు ఉండగా, మరికొంత మంది నమోదు ప్రక్రియలో ఉన్నారని తెలిపారు. ఈ సంఖ్యను గణనీయంగా పెంచేందుకు ప్రభుత్వ ఉద్యోగులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువత ముందుకు రావాలన్నారు. జీవితకాల సభ్యత్వం రూ.1000 మాత్రమే ఉండటం వల్ల ప్రజలు సులభంగా సభ్యత్వం పొందవచ్చని తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రజాపాలన విభాగంలోనే ప్రత్యేక రెడ్ క్రాస్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, అక్కడే నేరుగా రిజిస్ట్రేషన్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధులు నిర్వహించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి నమోదు ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. రెడ్ క్రాస్ కార్యకలాపాలను గ్రామ స్థాయి వరకు విస్తరించేందుకు మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యాసంస్థల్లో జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ కార్యక్రమాలను చేపట్టి విద్యార్థులను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని తెలిపారు. ప్రభావపంతమైన వ్యక్తులు, సంఘాలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. సభ్యత్వ నమోదు, విరాళాల సేకరణ పూర్తిగా పారదర్శకంగా జరగాలని, నగదు స్వీకరణ జరిగితే వెంటనే రెడ్ క్రాస్ ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు. వార్షిక ఆడిట్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, ఆర్థిక వ్యవహారాల్లో ఎటువంటి లోపాలు ఉండకూడదని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ ద్వారా రక్తదాన, వైద్య శిబిరాలు, విపత్తు నిర్వహణ కార్యక్రమాలు మరింత విస్తరించాలని, అవసరమైతే బ్లడ్ బ్యాంక్, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తమ బాధ్యతగా తీసుకుని ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. చిన్న చిన్న సంస్థలు, సంఘాలు కూడా సభ్యత్వంలో భాగస్వాములు కావాలన్నారు. రెడ్ క్రాస్ సంస్థ యుద్ధాలు, ప్రకృతి విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో మానవతా సేవలు అందించే ప్రముఖ సంస్థగా నిలిచిందని, ఈ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, రెడ్ క్రాస్ సొసైటీ నోడల్ అధికారి వేణుగోపాల్, మంజుల, అజారుద్దీన్, సంఘం జిల్లా చైర్మన్ అయ్యపు రెడ్డి, రాష్ట్ర ఈసీ మెంబర్ రమేష్, జిల్లా సభ్యులు మహేష్ నాయుడు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గురువారం । తెలంగాణ
07 మే 2026

నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

గౌడ బిడ్డలను అణగదొక్కాలని చూస్తే ఖబర్దార్...!!

నాగర్ కర్నూల్ తాలూకా గౌడ సంఘం నాయకులు వంగ లక్ష్మణ్ గౌడ్...

నాగర్ కర్నూల్ మే 5 (నినాదం)

గౌడ కులస్తులు ఏ కులానికి మతానికి వ్యతిరేకం కాదని కల్లు గీసుకుని కులవృత్తి చేసుకొని బ్రతికే గౌడ కులస్తులను అణగదొక్కాలని చూస్తే గౌడ సంఘశీ నాయకులు చూస్తూ ఊరుకోరు ఖబర్దార్ అంటూ నాగర్ కర్నూల్ తాలూకా గౌడ సంఘం నాయకులు వంగ లక్ష్మణ్ గౌడ్ హెచ్చరించారు. బల్మూరు మండలంలో విజయ్ గౌడ్ ఇంటిపై దాడిని నిరసిస్తూ నాగర్ కర్నూల్ తాలూకా గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అచ్చంపేట డిఎస్పి ని కలిసిన గౌడ సంఘం నాయకులు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బల్మూరు మండలంలో ఓ మహిళ మృతి చెందితే విచారణ జరిపి నిజ నిజాలు తేలియకముందే విజయ్ గౌడ్ ను టార్గెట్ చేసుకొని కల్తీ కల్లు త్రాగడం వల్లనే మహిళా మృతి చెందిందని పోలీసుల ముందే విజయ్ గౌడ్ ఇంటిపై దాడి చేసి గాయపరచడం ఎంతవరకు సమంజసం అన్నారు. గౌడ సమాజం ఈ దాడిని హేయమైన చర్యగా భావిస్తుందన్నారు. విజయ్ గౌడ్ ఇంటిపై దాడితో గౌడ కులస్తులను భయభ్రాంతులకు గురిచేయాలనుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన ఇంటిపై దాదాపు 30 మంది దాడి చేశారని ప్రాణ భయంతో విజయ్ గౌడ్ పోలీస్ స్టేషన్ కు పరిగెత్తుకు వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నారని అన్నారు. క్షణికావేశంలో ఏదైనా జరిగితే విజయ్ గౌడ్ కుటుంబానికి జరిగే నష్టాన్ని ఎవరు భరించేవారని ప్రశ్నించారు. సమాజంలో ఇలాంటి సంఘటనలు దారుణమన్నారు. భవిష్యత్తులో గౌడ కులస్తులపై దాడులకు పాల్పడితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.విజయ్ గౌడు ఒంటరి కాదని వారికి వారి కుటుంబానికి గౌడ సంఘం పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. బల్మూర్ కు చేరుకున్న గౌడ సంఘం నాయకులు అచ్చంపేట డివిజన్ డిఎస్పి స్థానిక ఎస్ఐలను కలిసి మహిళా మృతి పై పూర్తి విచారణ చేపట్టి నిజమైన దోషులను గుర్తించి చట్టపరంగా శిక్షించాలని విజయ్ గౌడ్ ఇంటిపై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ గౌడ కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మను ముద్రించాలి..

ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లింగమల్ల శంకరయ్య

పెద్దపల్లి రూరల్,మే-06(నినాదం):

దేశంలో చలామణిలో ఉన్న కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బొమ్మను ముద్రించాలని ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లింగమల్ల శంకరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహనీయులైన పూలే,సావిత్రి బాయి, అంబేద్కర్ జీవిత చరిత్రలతో పాటు, రాజ్యాంగంలోని అంశాలు ప్రతి ఒక్కరికి తెలిసేలా పాఠ్యాంశాలలో చేర్చాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.భారత కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మ ముద్రించేందుకు ఒత్తిడి తెచ్చేలా ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడతామన్నారు.అదే విధంగా నిట్టూర్ పాఠశాలలో జరిగిన దురదృష్ట సంఘటన చాలా బాధాకరమని, ఈ ఘటన యావత్ ఎస్సీ,ఎస్టీ కులాల వారి మనోభావాలు దెబ్బతీసాయన్నారు. నిట్టూరు కేసు చాలా పెద్దదని,దీని పై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. నిట్టూరు సంఘటనను ఎస్సీ,ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు ఎంపీలు అసెంబ్లీ, పార్లమెంట్లో లేవనెత్తి న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ సంస్కృతిక రాష్ట్ర అధ్యక్షులు దాసరి రామస్వామి, సొసైటీ రాష్ట్ర కార్యదర్శి క్యాదాసి రాజేశం,సొసైటీ జిల్లా అధ్యక్షులు బుల్లయ్య, నాయకులు మట్ట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతతోనే ప్రమాదాల నివారణ :నిర్మల్ ఎస్ఈ

నిర్మల్ ప్రతినిధి, మే 06 (నినాదం):

విద్యుత్ రంగానికి చెందిన సిబ్బంది విధి నిర్వహణలో ఏమరపాటుగా ఉండవద్దని, భద్రతా నియమాలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని టీజీఎన్పీడీసీఎల్ నిర్మల్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ (రాజు) జె. సుభాష్ పిలుపునిచ్చారు. మే 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న 'విద్యుత్ భద్రత వారోత్సవాల'లో భాగంగా బుధవారం నిర్మల్ సర్కిల్ కార్యాలయంలో సిబ్బందికి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ జె. సుభాష్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో లైన్మెన్లు మరియు ఇతర సిబ్బంది ఎదుర్కొనే సవాళ్లను ప్రస్తావించారు. ముఖ్యంగా ఎల్టీ (ఓ), హెచ్టీ (ఎ) లైన్ల మరమ్మతులు చేపట్టేటప్పుడు మరియు ట్రాన్స్ఫార్మర్ల నిర్వహణ సమయంలో ఖచ్చితంగా ఎర్త్ రాడ్స్, గ్లౌజులు, హెల్మెట్లు వంటి భద్రతా పరికరాలను ధరించాలని ఆదేశించారు. లైవ్ క్లియరెన్స్ (రాజ) తీసుకునే విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా అది ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు. డీఈ (ఇణజు) నాగరాజు మాట్లాడుతూ, వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో విద్యుత్ తీగలు తెగిపడటం, చెట్ల కొమ్మలు లైన్లపై పడటం వంటి సమస్యలు ఎదురవుతాయని, అటువంటి సమయాల్లో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. అనంతరం సావు (ూూూ) దిగంబర్ మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమంతో పాటు భద్రతకు సంస్థ ప్రథమ ప్రాధాన్యత నిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈలు శ్రీనివాసరావు, వెంకటపతి రాజు, ఏఈలు సంజీవ్, రాజ్కిరణ్, అనీల్, సాయికుమార్, మహేష్, సబ్ ఇంజనీర్లు కల్యాణ్, వెంకటేష్, సాయికిరణ్, ప్రత్యూషతో పాటు లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్మెన్లు మరియు కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు

వనపర్తి ప్రతినిధి, మే 6 (నినాదం)

ఏదుల మండలంలోని మాచుపల్లె గ్రామంలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీవిద్య పాల్గొన్నారు. ఈ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ యూనివర్సిటీ ఆరు విషయాలపై సాగుకు ముందు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యూరియా వాడకం అనేది తగ్గించాలని, నేలలను సంరక్షించుట, మార్కెట్లో డిమాండ్లో ఉన్న వర రకాల వాడకం,సేంద్రియ వ్యవసాయంపై అవగాహన, పంటమార్పిడి-సుస్థిరదాయం, సాగునీరు ఆదా చేయడం-భవిష్యత్ తరాలకి మేలు, అవసరం మేర రసాయనాల వాడకం, పంట మార్పిడి పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు అడిగిన సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు చెప్పారు. మండల వ్యవసాయ అధికారి రమేష్ నేల యొక్క ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని, చవుడు భూములను ఎలా పునరుద్ధరణ చేసుకోవాలని, రైతు భరోసా, రైతుభీమా, ఫార్మర్ రిజిస్ట్రీ ఆవశ్యకత గురించి రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో 63 మంది రైతులు పాల్గొన్నారు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలి
- రైతుల ఖాతాల్లో చెల్లింపులు త్వరితగతిన జమ చేయాలి
- ఎంపీ డాక్టర్ మల్లు రవి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్ మే 6 (నినాదం)

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండి మార్కెట్ యార్డ్లో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను బుధవారం సాయంత్రం నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి లు కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మార్కెట్ యార్డ్లో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను దగ్గరగా పరిశీలించి, రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, గన్ని బ్యాగుల సేకరణ, తూకం తదితర అంశాలపై రైతులు, అధికారులతో ఆరా తీశారు. తిమ్మసానిపల్లి గ్రామానికి చెందిన రైతులు రాముతో ఎంపీ ప్రత్యక్షంగా ఫోన్లో మాట్లాడి రైతు తన పొలంలో ఇంత మొక్కజొన్న పంట పండించారు ఎంత దిగుబడి వచ్చింది కొనుగోలు ప్రక్రియ ఎలా జరిగింది అనే అంశంపై రైతుతో ప్రత్యక్షంగా ఆరా తీశారు. ధాన్యం తూకం, తేమ శాతం కొలతలు, రికార్డు నమోదు విధానం వంటి అంశాలను సవివరంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకోకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని మార్క్ ఫైడ్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.. రైతులకు రైతు ప్రజా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర (మీ్రా) పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని ఆయన తెలిపారు. రైతులు తమ పంటను మార్కెట్ యార్డ్కు తీసుకువచ్చిన వెంటనే టోకెన్ ఆధారంగా నమోదు చేసి, ఆలస్యం లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అసవసరమైన వేచిచూపులు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఎంపీ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి ప్రతి గింజ కొనుగోలు చేస్తుందని రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీ సందర్భంగా కోరారు. అదేవిధంగా, కొనుగోలు అనంతరం రైతుల బ్యాంక్ ఖాతాల్లో చెల్లింపులు త్వరితగతిన జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ.. మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేసేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వెల్లడించారు. గన్ని సంచుల కొరతను తీర్చే విధంగా నేరుగా రైతుల నుండే గన్ని సంచులు తీసుకొని గని సంచులకు అవసరమైన రేటు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మార్కెట్ యార్డ్ పరిధిలో త్రాగునీరు, వీధి విశ్రాంతి కోసం షెడ్లు, నిల్వ గోదాములు, రవాణా సౌకర్యాలు వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలు చేపట్టాల్సిన అంశాలను కలెక్టర్ అధికారులను స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భనలో రైతులు తమ సమస్యలను తెలియజేస్తూ తక్షణ పరిష్కారం కోరగా, సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి నేరుగా తీసుకురావాలని ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను కలెక్టర్ ఈ సందర్భంగా రైతులకు తెలిపారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యం లేకుండా పూర్తిగా పారదర్శక విధానంలో వ్యవహరించాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. రైతులకు అనుకూల వాతావరణంలో, వేగవంతమైన, నిష్పాక్షికమైన కొనుగోలు ప్రక్రియను అమలు చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ విధంగానే క్షేత్రస్థాయి లో అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని, రైతులకు నష్టం కలిగించే ఏ విషయంపై ఉపేక్షించమని అధికారులకు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియలు నిర్వహించాలని ఆయన కోరారు. రైతులు పలు సమస్యలను తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే సిబ్బందిని పెంచుకొని రైతుల సమస్యలను పరిష్కరించాలని వారు అధికారులకు ఆదేశించారు. వారి వెంట మార్క్ ఫైడ్, పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల అధికారులు, రైతులు, తదితరులు ఉన్నారు

సహకార సంఘాల పాత్ర కీలకం

- యూరియా వినియోగాన్ని తగ్గిస్తేనే నేల సంరక్షణ
- భిన్న పంటలు సాగు చేసి రైతులు ఆర్థికంగా ఎదగాలి
- ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘకాలిక ప్రయోజనాలు
- రైతు సంక్షేమ వారోత్సవాల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల బ్యూరో మే 6 (నినాదం)

రైతులు ఒకే పంటను కాకుండా భిన్న పంటలు సాగు చేస్తే ఆర్థికంగా ఎదగవచ్చని, ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రైతు సంక్షేమ వారోత్సవాల్లో బుధవారం గద్వాల పిఏసిఎస్ లో సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేందుకు సహకార సంఘాల కృషి ఎంతో ఉందని, రైతుల సంక్షేమానికి రుణాలు ఇవ్వడం, సబ్సిడీకి విత్తనాలు, ఎరువులు అందజేయడం జరుగుతుందన్నారు. కొద్ది రోజుల కిందట జిల్లాలోనీ రైతులకు కొరత లేకుండా యూరియాను సరఫరా చేయడంలో ఆయా మండలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రధాన పాత్ర పోషించాయని కొనియాడారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు ప్రతి పిఏసిఎస్ కు 100 ఎకరాల లక్ష్యాన్ని నిర్దేశించినందున సంఘాల సభ్యులు సాగు చేసేందుకు సహకరించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆయిల్ పామ్ పంట సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ పంటను మూడేళ్ల పాటు జాగ్రత్తగా పెంచితే దాదాపు 25 ఏళ్ల పాటు ఫలితాలు పొందవచ్చన్నారు. జిల్లాలోని గ్రౌండ్ వాటర్ నివేదికను ఇటీవల పరిశీలిస్తే నైట్రేట్ శాతం ఎక్కువగా ఉన్నట్లు తెలిసిందన్నారు. యూరియాను అవసరానికి మించి వాడడం వలన నీళ్లు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, రైతులు నానో యూరియా పై దృష్టి సారించాలని సూచించారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని నేలను కాపాడుకోవాలంటే ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లా పిఏడిడీకేవై కు ఎంపికవడంతో రైతులు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో చెప్పుకోదగ్గ ప్రగతి సాధించే అవకాశం ఉందన్నారు. సంప్రదాయ పంటలే కాక మిల్లెట్స్, ఉద్యాన తోటలపై, పశుపోషణపై దృష్టి సారిస్తే ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి రుణమాఫీ, రైతు భరోసా, బీమా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. గద్వాల పిఏసిఎస్ ఉత్పత్తిదారుల సహకార సంఘంకు ఎంపికవడంతో ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రూ.15 లక్షలు మంజూర వడంతో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నేల ఆరోగ్యాన్ని కాపాడతామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పిఏసిఎస్ చైర్మన్ సుభాన్, గద్వాల మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, జిల్లా కోపరేటివ్ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఎల్ఐసి శ్రీనివాసరావు, కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్ కుమార్, పిఏసిఎస్ సీఈవో వెంకటేశ్వర్ రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు

విశ్రాంత గురువుకు ఆర్థిక సాయం అందజేత...

సుల్తానాబాద్, మే 06(నినాదం):

విశ్రాంత గురువుకు 1985 – 86 పూర్వ విద్యార్థులు ఆర్థిక సహా యం అందజేసి మానసున్న వారని నిలుపుకున్నారు. సుల్తానాబాద్ మండల కేంద్రా నికి చెందిన ఎం. డి .వలియుద్దీన్ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్న విషయము తెలుసుకున్న వారి శిష్యులు పో లాడి రామ్ గోపాల్. ఎన్ నారాయణ బాబు. జె. మల్లయ్య. అంజయ్య గౌడ్. ఆర్ స్వామి దాస్. గడ్డం అశోక్ రెడ్డి. హన్మాల రాములు. గడ్డం శ్రీని వాస్. దొడ్ల అంజనీ ప్రసాద్. పల్లెర్ల నరేందర్. మి ట్టపల్లి రామకృష్ణ . పీవీ శ్రీనివాస్. కొమురవెల్లి అశోక్. కొమురవెల్లి భాస్కర్. ఎండి. ముజాహిద్. ఎండి. అలీ మహమ్మద్ లు ఆర్థిక సహాయం అందజేశారు.

సాలురా సొసైటీ ఇంచార్జ్ చైర్మన్ గా అల్లే జనార్దన్

బోధన్ ప్రతినిధి,మే6:(నినాదం)

హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు సాలురా సొసైటీ ఇంచార్జ్ చైర్మన్ గా అల్లే జనార్దన్, వైస్ చైర్మన్ సందీప్ రెడ్డి, డైరెక్టర్లు తిరిగి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో సొసైటీ ఇన్చార్జి కార్యదర్శి సంజీవ్ కుమార్ పాలకవర్గానికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ అల్లే జనార్దన్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి, సొసైటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీవో హెచ్. శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన శివసేన రెడ్డి

వనపర్తి ప్రతినిధి, మే 6 (నినాదం)

వనపర్తి జిల్లా కేంద్రంలోని కళ్యాణ్ సాయి ఫంక్షన్ హాల్ లో సాయి కృష్ణారెడ్డి, సహజ రెడ్డి వివాహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కొత్త కాపు శివసేన రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన దంపతులను ఆశీర్వదించారు. హిందూ సంస్కృతిలో పవిత్రమైన బంధం, ఆధ్యాత్మిక బంధాన్ని ఏడు జన్మల బంధంగా భావిస్తారని గుర్తు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు కదిరే రాములు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాండు సాగర్ పలువురు పాల్గొన్నారు

రైతుల ధాన్యం కొనుగోళ్లలో అన్యాయం

కరీంనగర్, మే 6(నినాదం)

కరీంనగర్ రూరల్ మండలంలోని ముగ్ధంపూర్ రాజీవ్ రహదారిపై బీజేపీ నాయకులు రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరుతో ప్రతి క్వింటాల్కు అదనపు కోతలు విధించడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి కామన్ గ్రేడ్ ధరనే ఇవ్వడం వల్ల క్వింటాల్కు సుమారు రూ.2000 వరకు నష్టం వస్తోందని తెలిపారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో రవాణా సౌకర్యాల లోపంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తోందని ఆయన విమర్శించారు. రైతు ప్రభుత్వం అంటూ హామీలు ఇచ్చిన కాంగ్రెస్, ప్రస్తుతం రైతుల ఆశలను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. తరుగు పేరుతో జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే నిలిపివేయాలని, లేకపోతే బీజేపీ తరపున ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, అధికారం లోకి రాకముందు ఇచ్చిన రైతు భరోసా హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టలేదని విమర్శించారు. రైతు భరోసా మొత్తాన్ని తగ్గించడం, పలుమార్లు అమలు చేయకపోవడం, కౌలు రైతులను పక్కన పెట్టడం వంటి చర్యల వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విధానాలను మార్చుకుని రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాగ్రహసభను జయప్రదం చేయండి..

సుల్తానాబాద్, మే 06(నినాదం):

భారత ప్రధాని నరేంద్ర మోదీ రాజా ప్రజా గ్రహసభ ను జయప్రదం చేయడానికి ప్రతి ఒక్క బిజెపి కా ర్యకర్త కృషి చేయాలని బిజెపి మండల అధ్యక్షు డు కందుల శ్రీనివాస్ కోరారు. బుధవారం సుల్తా నాబాద్ మండల కేంద్రంలో మండల భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సమావేశం మండల అధ్య క్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించా రు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉమ్మడి కరీంన గర్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు మీస అర్జున్ రావు, మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ మా ట్లాడుతూ, బీజేపీ జాతీయ అధ్యక్షులునితిన్ నబి న్ ఆదేశాల మేరకు ప్రతి నెల మొదటి వారంలో మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి భవి ష్యత్తు కార్యాచరణ పై చర్చించడం జరుగుతుంద ని, అదేవిదంగా ప్రియమైన ప్రధానమంత్రి మూద వ సారి ప్రధానిగా అయిన తరువాత మొదటి సా రిగా తెలంగాణ వస్తున్న సందర్భంగా ఈ నెల 10 న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో ప్రజాగ్రహసభను ఘన విజయవంతం చేయాలని నిర్ణయించారు.

ఈ భారీ సభకు మండలంలోని అన్ని నాయకులు, కార్యకర్తలు, యువమోర్చా, మహిళా మోర్చా స భ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవం తం చేయాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, జిల్లా కౌంధికారి కామని రాజేంద్రప్రసా ద్, ప్రధాన కార్యదర్శి కొల్లూరి సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులు దొంగల శ్రీనివాస్ రెడ్డి, వీరగోని కిర ణ్, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, మెందే శంకరయ్య, వడ్లకొండ శశి వర్ధన్, పొన్నం శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, మేంగాని రామకృష్ణ, సుద్దాల రాంచం ద్రం, దాసరి చందు పటేల్, సాయి, పెరక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గురువారం । తెలంగాణ
07 మే 2026

నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

ఉపాధి అవకాశాలను

పెంపొందించాలని లక్ష్యంతో టాస్క్..

- యువత నైపుణ్యాభివృద్ధితోనే తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యం
- యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాల కోసం టాస్క్ ఆధ్వర్యంలో కేంద్రం ఏర్పాటు
- డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మల్టీమీడియా రంగాల్లో శిక్షణ లభ్యం
- మహిళల ఆర్థిక సాధికారతకు కుట్టు శిక్షణ కేంద్రాలు, గార్మెంట్స్ యూనిట్
- మంథనిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్

మంథని మే 6 (నినాదం)

ఉపాధి అవకాశాలను పెంపొందించాలనే లక్ష్యంతో టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత నైపుణ్యాభివృద్ధితోనే తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలను పెంపొందించాలనే లక్ష్యంతో టాస్క్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కేంద్రం ద్వారా డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మల్టీమీడియా, ఆడియో విజువల్ రంగాల్లో శిక్షణ అందించబడుతుందని పేర్కొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా కంట్రోల్ ఎ డేటా సెంటర్ సంస్థ సహకారంతో యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంథని వంటి ప్రాంతాలకు పరిశ్రమలను తీసుకురావడం సవాల్ తో కూడుకున్నదని, ఇక్కడి యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వ లక్ష్యమని, దీనిని సాధించడానికి యువతలో నైపుణ్యాలను పెంపొందించడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. మన విద్యార్థులకు మంచి అకడమిక్ పరిజ్ఞానం ఉన్నప్పటికీ పరిశ్రమలకు అవసరమైన కొన్ని నైపుణ్యాలలో లోపాలు ఉన్నాయని, వాటిని అధిగమించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించామని తెలిపారు. మంథనిలోని టాస్క్ కేంద్రం కూడా ఇదే విధంగా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించి వారికి ఉద్యోగాలకు సిద్ధం చేస్తుందని వివరించారు.టాస్క్‌లో నమోదు చేసుకుని వలు శిక్షణ కోర్సులు పూర్తి చేసిన అనేక మంది విద్యార్థులు మల్టీనేషనల్ కంపెనీల్లో మంచి వేతనాలతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఇక్కడ మంచి కంపెనీలు శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జేఎన్టీయూ మంథనిని ఈ ప్రాంతానికి తీసుకువచ్చిందని, ప్రతి విద్యార్థి భవిష్యత్తు తన బాధ్యతగా భావిస్తున్నానని, క్రమశిక్షణతో శిక్షణ పొందాలని సూచించారు.అలాగే మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. దీని ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందగలరని అన్నారు. గంగాపురిలో రూ.7.3 కోట్ల వ్యయంతో ఫ్లగ్ అండ్ ప్లే గార్మెంట్స్ యూనిట్‌కు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఇది పూర్తయిన తర్వాత ఒకేసారి 400 మంది మహిళలకు శిక్షణ అందించవచ్చని, విజయవంతమైతే మరో యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతి నిరుద్యోగ యువకుడు కష్టపడే మనస్తత్వాన్ని కలిగి ఉండాలని, కష్టాలను ఎదుర్కొన్నప్పుడే విజయాలు సాధ్యమవుతాయని అది గుర్తుంచుకోవాలని సూచించారు. మంథని పట్టణానికి అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో కూడిన శిక్షణ కేంద్రాలను తీసుకురావడమే లక్ష్యంగా టాస్క్ అడ్వాన్స్‌డ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అనేక ఉద్యోగాలు మార్పులకు లోనవుతున్నాయని, మార్కెట్లో నిలదొక్కుకోవాలంటే యువత తప్పనిసరిగా వంటి ఆధునిక నైపుణ్యాలను అభ్యసిస్తూ కొత్త సాంకేతికతలను స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, మినిమమ్ వేజెస్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, టాస్క్ చైర్మన్ నితిన్ కుమార్ రెడ్డి, కంట్రోల్ ఎస్ డేటా సెంటర్ సంస్థ డైరెక్టర్ రాజీవ్ త్రివేది,ఏఎంసీ చైర్మన్ కె. వెంకన్న, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

వనపర్తి ప్రతినిధి, మే 6 (నినాదం)

వర్ల్డ్ డే సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని వనిత జ్యోతి మహిళా సంఘం కార్యాలయంలో కమ్యూనిటీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతి జోహార్ రెహమాన్, ద్వితీయ బహుమతి ముస్కాన్ కు, కన్సోలేషన్ బహుమతులను ఫర్హాన్, అమన్ లకు వనపర్తి డిఇఓ అబ్దుల్ ఘనీ అందజేశారు. ఈ కార్యక్రమంలో వనిత జ్యోతి మహిళా సంఘం చీఫ్ ఫంక్షనరీ డాక్టర్ పీకే.ఖమర్ రెహమాన్, విజేఏంఎస్ అడ్వైజర్ కోళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వనిత జ్యోతి మహిళా సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వి జే ఏ ఎస్ అడ్వైజర్ గా కోళ్ల వెంకటేష్ ను ఎన్నుకున్నట్లు చీఫ్ ఫంక్షనరీ డాక్టర్ ఏకే. ఖమర్ రెహ్మాన్ తెలిపారు

భర్త చేతిలో భార్య హతం

- కోదాడలో అందరూ చూస్తుండగానే దారుణం
- బస్టాండ్ ఆవరణలో భార్యపై భర్త కత్తి దాడి
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువతి మృతి
- కుటుంబ కలహాలే హత్యకు కారణం..

కోదాడ,మే 6(నినాదం):

కోదాడ పట్టణంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. బస్టాండ్ ఆవరణలో ఉన్న టీ స్టాల్ వద్ద భార్యపై భర్త కత్తితో దాడి చేయడం సంచలనం సృష్టించింది. విచక్షణ రహితంగా దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన మహిళను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన బత్తుల శిరీషకు, కోదాడ పట్టణంలోని బాబుసగర్‌కు చెందిన మణిదీపతో ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం వీరు కోదాడలోనే నివాసం ఉంటున్నారు. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. గత 15 రోజులుగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నట్లు సమాచారం. జగ్గయ్యపేటలో పెద్దమ్మ ఇంటికి వెళ్లేందుకు, టీ స్టాల్ సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద ఉన్న సమయంలో ఈ ఘటన జరిగింది.మృతురాలి పెద్దమ్మ వెంకమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కౌన్సిలర్ స్పందించిన తీరుపై ప్రజల్లో హర్షం

మంథని టౌన్ మే 06 (నినాదం) : మంథని పట్టణంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో రోడ్లన్నీ జలమయ మయ్యాయి. ముఖ్యంగా 10వ వార్డు పరిధిలోని తమ్మిచెరువు కట్ట వీధి, పద్మశాలివాడ, అపార్ట్మెంట్ ప్రాంతంలోని రోడ్లన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. నాలాల్లో పేరుకుపోయిన చెత్తను వార్డ్ కౌన్సిలర్ పెంటరి రాజు స్వయంగా ఒక్కరే తొలగించి నీరు సులభంగా పోయేందుకు మార్గం సుగమం చేశారు. పట్టణంలో సుమారు గంటకు పైగా భారీ వర్షం పడడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఈ దుస్థితిని గ్రహించిన రాజు రాత్రి సమయంలో ఒక్కడే రంగంలోకి దిగి వర్షం నీరు రోడ్డు పైన నిలవకుండా నాలాలను శుభ్రం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చేశారు.ప్రజల ఇబ్బందులపై స్పందించిన కౌన్సిలర్ రాజు తీరు పట్ల అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతు ముంగింట్లో శాస్త్రవేత్తలు

కోదాడ,మే 6(నినాదం): అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామ రైతువేదికలో రైతు ముంగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రాములమ్మ, కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపిక, యూరియా అధిక వినియోగం వల్ల నేల సారం తగ్గుదల, రసాయన పిచికారీ జాగ్రత్తలు, కేంద్రీయ వ్యవసాయం, పంట మార్పిడి వంటి అంశాలపై వివరించారు. ఏవో సతీష్, ఏఈఓ అన్వేష్ రాజా, సర్పంచ్ జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అమరచింత, మే 6, (నినాదం):

రైతుల సమస్యలన్నిటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రహమతుల్లా అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ వద్ద రైతు వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయాన్ని ఒక వ్యాపారం లాగ నిర్వహించాలని సూచించారు వ్యాపారులు లాభాల కోసం వ్యాపారం చేస్తారని రైతులు కూడా అదే దిశగా వ్యాపారం దృష్టిలో పెట్టుకొని లాభం వచ్చే విధంగా వ్యవసాయం చేయాలని సూచించారు. ముఖ్యంగా పంట మార్పిడి వల్ల నేల సారవంతం అవుతుందని అధిక దిగుబడి వస్తుందని రైతులకు ఆయన సూచించారు. రైతులు అడిగిన సందేహాలను మండల వ్యవసాయ అధికారి రమేష్ నాయక్ తీర్చారు. వడ్ల తరలింపులో ఎలాంటి జాప్యం ఉండదని రైతులు అధైర్యపడవద్దని సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లర్లకు తరలిస్తామని అన్నారు. గన్ని బ్యాగుల కొరత లేదని రైతులు ఎలాంటి అభద్రతాభావానికి లోన్ కావద్దన్నారు. వ్యవసాయ మార్కెట్ వద్ద ప్రత్యేకంగా తూర్పు పట్టే యంత్రం ఉందని రైతులు ధాన్యాన్ని తూర్పు యంత్రంలో శుద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గాడి కృష్ణమూర్తి, కౌన్సిలర్లు కోట్ల తిరుపతి, సర్దల తులసి వెంకట్ రాములు దండు శ్రీనివాసులు కో ఆప్షన్ సభ్యులు జహంగీర్ సౌజన్య గంగాధర్ మార్కెట్ డైరెక్టర్లు రైతులు పాల్గొన్నారు.

శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి శంకుస్థాపన

మహాదేవపూర్ మే 6, (నినాదం): జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీ మండలం అయిన పలిమెల మండలంలోని పంకెన లో స్థానిక సర్పంచ్ పాడే వైకుంఠం ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్రస్వామి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామ వార్డు సభ్యులు, పెద్దలు, మహిళలు పూజారుల వేద మంత్రో చ్చారణల మధ్య శంకు లకు, ఇటుకలకు శ్రీరామ నామ జపంతో పూజలు నిర్వహించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు హనుమాన్ జెండాను చేత బూని శంకుస్థాపన , మహా యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేకల రాజక్క బ్రహ్మశ్రీ గణేశ్వరచార్యులు, ముక్తేశ్వర చార్యులు, శశి శర్మ, రామాచార్యులు, ఉదయ చార్యులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన సదస్సు

వెల్దుర్తి , మే 6 (నినాదం): నేడు మాసాయిపేట గ్రామానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు రావడం జరుగుతుంది. కావున అందరు రైతులు అందుబాటులో ఉండాలని వ్యవసాయ అధికారి ఏఈఓ రజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పంటల సాగు గురించి, యూరియా, ఎరువుల వాడకం గురించి, నేల సంరక్షణ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుంది. వానాకాలానికి, సంబంధించిన సన్న రకాల, విత్తనాల వాడకం, గురించి తెలియజేస్తారు. రైతులు ఇట్టి అవకాశాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి, ఏఈఓ రజిత, తెలిపారు.

క్రీడా శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు ఘన సత్కారం

సుల్తానాబాద్, మే 06(నినాదం):

తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ డిప్యూటీ డైరెక్టర్ గు గులోతు అశోక్ కుమార్ ను పెద్దపల్లి జిల్లా సుల్తా నాబాద్ లోని సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో ఘనంగా సత్కరించారు. బుధవారం పెద్ద పల్లి పర్యటనకు వచ్చిన ఆయన సుల్తానాబాద్ లో పర్యటించారు. డిప్యూటీ డైరెక్టర్ గా నియామ కమైన తర్వాత తొలిసారిగా సుల్తానాబాద్ రావ డంతో ఆయనకు సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ ఘన స్వాగతం పలికింది. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ము స్తాల రవీందర్ ఆయన కు పుష్పగుచ్ఛాన్ని అం దించి పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరిం చారు. చిన్న వయసులోనే డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి పొంది యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అభివృద్ధి చెందేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నారన్నారు. అం దులో భాగంగానే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూ నివర్సిటీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నెలకొ ల్పుతు న్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లో క్రీడలకు కంచుకోట సుల్తానాబాద్ అని కొనియాడారు. ఇ క్కడి నుంచి ఎందరో క్రీడారంగంలో ఉన్నత స్థాయి కి ఎదిగారని జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో రాణించిన ఘనత సుల్తానాబాద్ కి దక్కిందనీ అ న్నారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శులు , ఉపాధ్యక్షులు అమిరిశెట్టి తిరుపతి, శంకరయ్య, బైరగోని రవీందర్ గౌడ్, తెలంగాణ ఒలంపిక్ సంఘం సభ్యులు సి లివేరి మహేందర్, ఖేలో ఇండియా కోకో కోచ్ గెల్లు మధుకర్ యాదవ్, శెట్టి శ్రీనివాస్, సిలివేరి రాము, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన

దోర్నకల్ /మరిపెడ మే 06(నినాదం)

ప్రజా పాలన ప్రగతి ప్రాణాలికలో భాగంగా మరిపెడ మండలం గిరిపురం రైతు వేదికలో రైతులకు ఆర్గానిక్ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయడం రైతులు అలవర్చుకోవాలని,రసాయనాలు వాడకుండా పంటలు పండించుకుని తినడం ఆరోగ్యానికి ఎంతో మేలు అన్నారు. రైతులు బిటి 3 పత్తి విత్తనాలను వాడకూడదని,వాటిని వాడడం వలన భూసారం దెబ్బతింటుందని, రైతులకు, రైతు కూలీలకు క్యాన్సర్ వచ్చే ప్రమాదం అతిగా ఉందన్నారు. ఇతర రాష్ట్రాల,జిల్లాల నుండి వచ్చి తక్కువ ధరకే విత్తనాలు ఇస్తే రైతులు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. కొందరు దళారీలు మాయ మాటలతో మోసం చేసి నకిలీ విత్తనాలను కట్టిపెడతారన్నారు. ఆరుగాలం కష్టించి పండించే వ్యవసాయాన్ని నాణ్యమైన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు.మన సమీప పర్టిలైజర్ షాపులలో కొనుగోలు చేసి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న జినుగు విత్తనాలు పొలాలలో చల్లుకుంటే, ఎరువుగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ చావల యాదగిరి రెడ్డి,డైరెక్టర్లు,డిస్ట్రిబ్యూ అగ్రికల్చర్ ఏవో బి సతీ, ఏ డి ఏ విజయ్ చంద్ర,ఆర్ ఏం వెంకన్న, పిఏసిఎస్ కామేపల్లి చైర్మన్ లక్ష్మీదేవి రెడ్డి, ఏవో వీరా సింగ్,వివిధ మండలాల వ్యవసాయ శాఖ అధికారులు నరసింహా,భాస్కర్,ఏ ఈ ఓ లు,రైతులు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే సహకార శాఖ ధ్యేయం

మునుగోడు, మే 6 (నినాదం):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ మరియు సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో భాగంగా బుధవారం మునుగోడు మండల కేంద్రంలోని రైతు వేదిక నందు ది నలగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మునుగోడు మేనేజర్ రాగిణి అధ్యక్షతన జరిగింది ముఖ్య అతిథిగా చండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ హాజరైనారు. నియోజకవర్గం లోని సహకార సంఘం అధ్యక్షులు ,మునుగోడు నియోజకవర్గం లోని 5 సహకార సంఘాల ద్వారా నియోజక వర్గంలోని రైతులకు అందుతున్న సేవలను పి. సుఖేందర్ కార్యదర్శి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో, ఏడిఏ వేణుగోపాల్ , ఎమ్మార్వో నరేష్, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ జ్యోతిర్మయి, సీనియర్ ఇన్స్పెక్టర్ రమేష్ , ఆడిటర్ రేణుక, కమలాకర్, ఏఎంసి సెక్రెటరీ రఘుపతి , ఉద్యానవన శాఖ విద్యాసాగర్ , ఏవో మునుగోడు పద్మజ, నియోజకవర్గంలోని ఏ ఈ ఓ లు, నరసింహ, యాదగిరి, వాజిద్ అంబేద్కర్, శివన్నగూడెం సొసైటీ చైర్మన్ బాల నరసింహ, మరియు పాలకవర్గం, ఎస్బీఐసీబీ బ్రాంచ్ మేజర్ రాగిణి (మునుగోడు) అనుముల భరత్ (చండూరు) ఉదయ్ (గుర్రంపోడు) మునుగోడు బ్యాంక్ సూపర్వైజర్ నరేష్, ఏఎంసి డైరెక్టర్లు కుంభం చెన్నారెడ్డి, ఎస్ కే హైమద్ ,మరియు నియోజకవర్గంలోని 5 సహకార సంఘాల పాలకవర్గ సభ్యులు మరియు సంఘ సెక్రెటరీలు ,సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు రావాలి

సుల్తానాబాద్, మే 06 (నినాదం):

ఆయిల్ ఫామ్ సాగుకు రైతులందరూ ముందుకు రావాలని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు రైతులకు పిలుపునిచ్చారు. రైతులు లాభాలు పొందాలంటే పంటమార్పిడి,కూరగాయ లు, ఆయిల్ ఫామ్ పంటలపై దృష్టి సారించాలని రైతులను కోరారు. బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాల కార్యక్రమం వ్యవసాయ మార్కెట్యార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకా ష్ రావు మాట్లాడుతూ, వారి పంటల కంటే ఆయి ల్ ఫామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా అధిక లా భాలు అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ సభ్యులు కందు సూరి పోచన్న, బొజ్జ మల్లయ్య ,అమినోదిన్, ఇ ల్లందు శ్రీనివాస్, పిఏసిఎస్ సభ్యులు ఓదెలు అ లాగే మార్కెట్స్ కమిటీ సిబ్బంది సుమారుగా రై తులు నోరు నుంచి 120 మంది మహిళ రైతులతో పాటు రైతులు పాల్గొన్నారు.

జనాగ్రహ సభను విజయవంతం చేయండి : ఎంపీ నగేష్

భూపాలపల్లి ప్రతినిధి, మే 06(నినాదం):

ఈ నెల 10న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించబడే జనాగ్రహ సభను విజయవంతం చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ హైదరాబాద్ లోని సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్న నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని కోరారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మూడు రాష్ట్రాల్లో విజయం సాధించిందని, ఇది దేశవ్యాప్తంగా ప్రజలు బీజేపీ పార్టీ పై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని తెలిపారు. అలాగే పశ్చిమ బెంగాల్, అస్సాం, పాండిచ్చేరి రాష్ట్రాల్లో మొన్న వెలువడిన ఫలితాల్లో కూడా ఘన విజయం సాధించామని, అదే ఉత్సాహంతో తెలంగాణలో కూడా త్వరలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.మూడవసారి ప్రధానమంత్రిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా హైదరాబాద్‌కు విచ్చేస్తున్నారని, తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తెలంగాణలో అధికారంలో లేకపోయినా రాష్ట్రానికి సుమారు 7 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి ప్రధానమంత్రి వస్తున్నారని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ మరియు దాని మిత్రపక్షాలు అడ్డుకోవడం సిగ్గుచేటని, దేశంలోని మహిళలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని విమర్శించారు. తెలంగాణ రైల్వేలకు 95 వేల కోట్ల నిధులు, జాతీయ రహదారులకు వేల కోట్ల రూపాయలు కేటాయించినప్పటికీ, కేంద్రం నిధులు ఇవ్వడం లేదని రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని అన్నారు.గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం కూడా ఇదే విధంగా కేంద్రంపై తప్పుడు ఆరోపణలు చేసి, చివరికి ప్రజల విశ్వాసం కోల్పోయిందని విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మహిళల ఆవేదన పెరుగుతోందని, ఇది ప్రభుత్వానికి ప్రమాదకరమని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నిశిధర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ రెడ్డి ,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షులు అశోక్ రెడ్డి, వెన్నెంపల్లి పాపన్న, జన్నే మొగిలి, మొగిలి, ఆరో వార్డు కౌన్సిలర్ ఎరుకల రేణుక గణపతి,జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్, పెండ్యాల రాజు, తాడికొండ రవి కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు సామల మధుసూదన్ రెడ్డి, వెశాల సత్యవతి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చింతపల్లి , మే 6 (నినాదం) రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని బాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన రైతు వారం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతుల అభివృద్ధి, వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతుల ప్రోత్సాహం, రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహించే "రైతు వారం" కార్యక్రమం ఎంతో ప్రాధా న్యతను సంతరించుకుందన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా రైతులకు రైతు వేదికలలో పంటల మార్పిడి, నేల ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సన్నాలకు బోనస్ ఇవ్వడంతోపాటు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో రైతులకు అందుబాటులో ఉంచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్ సహకారంతో మార్కెట్ అభివృద్ధికి కృషి చేయడం తో పాటు రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆమె అన్నారు. అనంతరం ప్రతి గ్రామం నుంచి కొంతమంది రైతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కాసారపు శ్వేతా శ్రీనివాస్,పిఏసిఎస్ చైర్మన్ లింగంరాల వెంకటయ్య, తాసిల్దార్ పందల విజయలక్ష్మి, ఆర్ ఐ జి. సునీత, సీతంపేట రాజశేఖర్ రెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ నల్ల సుధాకర్ రెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దొంతం సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, డిసిసి ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్, అధికార పార్టీ ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, మాజీ జెడ్పిటిసి హరిలాల్ నాయక్, గొడకొండ్ల మాజీ సర్పంచ్ అంగిరేకుల గోవర్ధన్, తక్కల్లపల్లి, కురుమ పల్లి సర్పంచులు ఆంజనేయులు ,కట్ట మహేష్, డైరెక్టర్లు ఎండి .ముషర్, హనుమా నాయక్, మధు నాయక్,తదితరులు పాల్గొన్నారు.